జె. పరిమళా సోమేశ్వర్



# సిక్స్ పాయింట్ ఫార్ములా

ఈ కథ పేరు చూసి యిదేదో రాజకీయ వ్యవహారం తాలూకు నివేదిక కాబోలునని భయపడకండి. ఇది నూటికి నూరుపాళ్ళ సాంసారిక కథ : ఒక సాధారణ దాంపత్యజీవితంలో సర్వ సాధారణంగా ఎదురయ్యే ఒడిదుడుకుల కథా కమామీషూ మాత్రమే : (సో, సాంసారిక కథలంటే వళ్లమండే పాఠకులు, మొగుడూ పెళ్ళాల కథలనగానే ముఖం మాడ్చుకునే మహానుభావులు - యీ పేజీని తపీమని తిప్పేయవచ్చు).

ఆ మధ్య ఓసారి కళ్యాణి భర్తమీద ఎందుకో చాలా గట్టిగా అలిగింది. ఆ మాటకువస్తే కళ్యాణి అడపాదడపా భర్తమీద అలుగుతూనే ఉంటుంది. అసలు అలగటమంటూ జరిగితే చాలా గట్టిగానే అలుగుతుంది కళ్యాణి.

ఏడేళ్ళ సాంసారిక జీవితంలో కనీసం కళ్యాణి భర్తమీద ఏడువందల సార్లయినా అలిగి ఉంటుంది. ఐనా ఆమె ఎప్పుడు ఏ కారణంతో ఎలా అలుగుతుందో యింతవరకు ఆమె భర్త కాంతారావుకి అంతుపట్టనేలేదు. కాలేజీలో ఇంగ్లీషు పాఠాలు చెప్పే కాంతారావుకి 'జీనియస్' అనే మారుపేరుంది.

ఐనప్పటికీ అర్ధాంగి అలకను

మాత్రం - అంటే దాని పుట్టుపూర్వోత్తరాలు, నివారణోపాయాలు, ఉపశమన మార్గాలు - వగైరా విషయాలను మాత్రం పరిపూర్తిగా అర్థంచేసుకోలేకపోయేడు కాంతారావు. అందుకే కాబోలు కళ్యాణి "మీరు 'జీనియస్' అని ఎవరండీ అనేది? నన్నడగమనండి. మీరెంత తెలివితక్కువ మనషులో నాకు తెలిసినట్లు బయటివాళ్ళకేం తెలుస్తుంది చెప్పండి" అంటుంది.

నిజమే! పనిమనిషి నెలలో పది రోజులు 'నాగా' పెట్టినా మందలించకుండా పూర్తిజీతం దాని చేతిలో పెట్టటం, పుచ్చు పురుగూ అన్నీ ఏరిచూసి కూరలను దుకాణంవాడు చేతిలోపెడ్తే బుద్ధిగా వాటిని యింటికి జేరవేయటం, అడిగిన వాళ్ళందరికీ కాదనకుండా చేబదుళ్ళు యివ్వటం, ఆ యిచ్చిన సంగతి మరుక్షణమే మర్చిపోవటం, ఒకవేళ గుర్తున్నా, తనకు ఎంతో డబ్బు అవసరం ఉన్నా, అప్పుని తిరిగి తీర్చమని అడగకపోవటం ... యివన్నీ కళ్యాణి దృష్టిలో తెలివితక్కువ విషయాలు కావటంలో తప్పేంలేదు.

వాటి సంగతటుంచి ఆధునిక ఆంగ్ల సాహిత్యంలోని స్త్రీపాత్రల స్వభావాలను గురించి నిశితంగా చదివి, థీసిస్ సబ్మిట్ చేసి, డాక్టరేట్ పట్టాపొందిన కాంతారావు అర్ధాంగి అలకయొక్క పూర్వాపరాలను క్షుణ్ణంగా తెలుసుకోలేకపోయేడంటే అది ముమ్మాటికీ తన తెలివితక్కువతనమే అని కాంతారావు కూడా స్వగతంలో వాపోతూంటాడు.

కళ్యాణి ఒక్కోసారి అలిగినప్పుడు, అలగబోయేముందు ఆ ఛాయలను తన ముఖకవళికలలోను, వస్త్రధారణలోను, చెంబూ తప్పేలాలు, పోపుడబ్బాలు, పప్పు డబ్బాలు మొదలైన వంటింటి వాద్యసమ్మేళనాలద్వారాను చూపెడుతూనే ఉంటుంది. కాని ఒక్కొక్కప్పుడు చక్కగా కాంతారావు కిష్టమైన చీరకట్టుకుని అతనికిష్టమైన కూరవండి స్వయంగా అన్నం కలిపి నోట్లోపెట్టే సమయంలో కూడా హఠాత్తుగా అలిగేస్తుంది. అక్కడే ఉంది అసలు చిక్కు. ఇక ఆమె అలకపాన్పు ఎక్కిందంటే కాంతారావుకి ఆమె కట్టుకున్నచీర మసిగుడ్డలాగాను, ఆమె పెట్టిన కూరముద్దలు కటిక విషంలాగానూ స్ఫురించక మానవు.

ఏ సినిమాకు వెళ్ళాలీ అన్న విషయంమీదగాని, పండక్కి ఎలాటి చీర కొనాలీ అన్న విషయంమీదగాని పొరపాటున ఎప్పుడన్నా కాంతారావు మాట నెగ్గిందో కళ్యాణి మనసు అల్లల్లాడిపోతుంది. స్త్రీ జాతిని అణగద్రొక్కటానికే పుట్టిన మగరాక్షస జాతికి ప్రతినిధిగా కనిపిస్తాడతడాసమయంలో.

"అసలు మీ బూర్జువా మొగుళ్ళ ఆటలిన్నాళ్ళూ సాగనివ్వటమే మా

తప్పు. ఇప్పటికైనా స్త్రీజాతి మేల్కొని మీ 'జులుం' ని పడగొట్టి, నవసంసార నిర్మాణం చెయ్యాలి" అంటూ ఉపన్యాసం యిస్తుంది.

"అసలు కళ్యాణిని తెలుగు వార పత్రికలు, నవలలు, ఫెమినాలు చదవనివ్వటమే పెద్ద పొరపాటు. ఎక్కడో పాశ్చాత్యదేశాల్లో తలెత్తిన "ఉమెన్సు లిబ్" తాలూకు మంటలు ఇండియాలోకి కూడా పాకేట్టుచేస్తున్నయ్ యీ పత్రికలు, ఖర్మ!" అనుకున్నాడు కాంతారావు.

"కొంపతీసి వీళ్ళుకూడా అప్పడాల కర్రలు, రోకలిబండలు తీసుకుని సాయుధ పోరాటానికి సిద్ధంకారుకదా" అని కూడా భయపడిపోతూంటాడు. ఎంత చదువుకున్నా, ఎన్ని ఉన్నత భావాలున్నా, అతను భారతీయ భర్తయ్యే! ఆ మాత్రం భయపడటంలో ఆశ్చర్యంలేదు.

ఐతే ప్రేయసిని భార్యగా చేసుకుని, భార్యలోనే ప్రేయసిని చూసుకుంటూ సంసారాన్ని సుందరకావ్యంగా మలచుకోవాలనుకునే సెంటిమెంటల్ మగవాడు కనుక ఆ పరిస్థితి అసలు రాకుండానే చూడాలని ప్రయత్నిస్తుంటాడు కాంతారావు.

వానరాకడ, ప్రాణంపోకడ తెలియదంటారు. అలాగే కళ్యాణి అలకరాకడ కూడా కాంతారావుకి యింతవరకు అంతుపట్టని సమస్యే అయింది.

ఆ అలక రానేరాకూడదు కాని వచ్చిందంటే దాని అంతేమిటో కళ్యాణి తేల్చుకునేవరకు ఇద్దరికీ నిద్రాహారాలుండవు.

"అసలు మీకు నా మీద 'ప్రేమ' అనేదేమన్నా ఉందా?" అని ఓసారి ఉన్నట్టుండి అడిగేస్తుంది నిలబెట్టి.

"అదేం? ఏమిటా ప్రశ్న?" అని అతనింకా యేమిటో అనే లోపలే సగం కోపం వచ్చేస్తుంది కళ్యాణికి.

"ఏమి ప్రశ్నేమిటి? ఒక ఆడది మొగుణ్ణి అడగవలసిన ప్రశ్నే అది. మీరలా తప్పించుకోవటంలోనే తెలిసిపోతోంది మీకు నా మీద ఎంత ప్రేమ ఉందో..." అంటూ పూర్తికోపం తెచ్చుకుంటుంది కళ్యాణి.

అక్కడినుండి అనునయాలు, కన్నీళ్ళు, లాలింపులు, ముక్కుచీదుళ్ళు, ముద్దులు, మోహమాటాలు, క్షమార్పణలు, బెట్టుసరులు, నవ్వులు... ఆ క్రమంలో ప్రణయకలహం తాలూకు కార్యక్రమం పూర్తవుతుంది.

ఇలాటి తంతులు వారి దాంపత్య జీవితంలో ఎన్ని జరిగేయంటే చివరికి వారికే ఆ ఘట్టం సమీపిస్తుందనగానే బోరుకొట్టడం ప్రారంభించింది.

అందుకే ఏ విషయానికైనా-ఆఖరికి భార్యాభర్తల మధ్య వచ్చే ప్రణయ కలహాలకి కూడా కొన్ని నియమ నిబం

ధనలు ఉండి తీరాలి అన్న ఉద్దేశ్యం వారికి ఏర్పడింది వాటికోసం ప్రత్యే కించి కొన్ని సూత్రాలను ప్రతిపాదిం చేడు కాంతారావు. సవరణల పేరిట ఆ సూత్రాల స్వరూపమే మార్చివేసి, వాటిని 'సూత్రప్రాయంగా' ఆమోదించింది కళ్యాణి

చివరికి ఆ భార్యాభర్తలిద్దరూ తయారుచేసిన ఆరుసూత్రాల పధకం తాలూకు సారాంశం యిది.


మొదటి సూత్రం :- తమ ఇద్దరికీ మధ్య భేదాభిప్రాయాలు వచ్చినప్పుడు శాంతియుతమైన పద్ధతిలో నోటిమాటల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలే తప్ప అనవసరంగా చెంబులు, గ్లాసులు, పళ్ళేలు మొదలైన నిస్సహాయులు, నిర్జీ వులు అయిన జడపదార్థాలను ధ్వంసం చేసుకోకూడదు.

ఈ సూత్రాన్ని కాంతారావు ప్రతి పాదించగానే కళ్యాణి మూతిని ముప్పై వంకర్లు తిప్పింది. "అంటే యేమిటి ? వాటితో మిమ్మల్ని నేనేమన్నా కొడు తున్నానా ? ఇలాటి అబద్ధపు ఆరో పణలుచేసి నన్ను అవమానపరచటానికే మీరీ సూత్రాన్ని యిరికించేరు" అంది ముక్కుచీదేస్తూ.

"నన్ను కొట్టినా బాగానే ఉండును. వాటిని నేలకేసి కొడుతుంటే ఎన్ని గిన్నె లకు సొట్టలుపడుతున్నాయో ఎన్ని గరి టెల కాడలు విరిగిపోతున్నాయో ... నీకు తెలియందేముంది చెప్పు ? అందుకే యిలాటి చిన్న చిన్న విషయాలకోసం వస్తునష్టం చేసుకోవటంలో అర్థమేమన్నా ఉందా ? ఆ వస్తువులు పాడైపోతే చివరికి నష్టపోయేది నువ్వేగా. ఉదాహ రణకి క్రిందటి నెలలో ఒక చారుగరిటె, ఒక అన్నంతినే పళ్ళెం మరీ ఉపయోగ పడే స్థితిలో లేకపోవటంవల్ల వాటిని కొత్తగా కొనవలసి వచ్చింది. పనిలో పనిగా మరో రెండు స్టీలు గిన్నెలు కూడా కొంటిచి. మొత్తం ఎనభై రెండు రూపాయలు నష్టంఅయింది. ఆ గరిటె, పళ్ళెం పాడుకాకుండా ఉన్నట్లయితే ఆ స్టీలు సామాన్లన్నీ కొనకపోయేవాళ్ళమే కదా. ఆ ఎనభై రెండు రూపాయలూ మిగిలినట్లయితే నీకో నైలెక్సు చీర వచ్చేది కదా !" అన్నాడు కాంతారావు.

కాంతారావు యిచ్చిన ఉపన్యాసంలో ఒక్క వాక్యమైనా తలకెక్కించుకోక పోయినా 'నైలెక్సు చీర' అన్న పదం మాత్రం బాగా పనిచేసింది కళ్యాణిమీద

అతనన్నమాటల్లో కొంత నిజం లేక పోలేదు అనుకుంది. వెనుకటికెవరో "తేగలా అయిపోయావే" అంటే 'తేగ కావాలి' అని ఏడ్చినట్లు కళ్యాణికి "నైలెక్సు చీర" అన్నపదం విన్న తర వాత చీరలను గురించి కాంతారావుకి పెట్టుకున్న విన్నపాలు, వేధింపులు అన్నీ గుర్తుకు వచ్చినయ్ వెంటనే ప్రతి నెలా తనకొక చీర - యాభై రూపాయలకు




తక్కువకాకుండా కొనిపెట్టాలనీ, పండగలు, పుట్టినరోజులు (పుట్టిన రోజులు-అని ఎందుకంటున్నానంటే తన పుట్టిన రోజునే కాక భర్త పుట్టిన రోజునకూడా కొత్తచీర కట్టుకోవటం కళ్యాణికి ఆనవాయితీ) మొదలైన సందర్భాలలో వంద రూపాయలచీర కొనివ్వాలనీ దీనిని తమ ఆరు సూత్రాల పథకంలో చేర్చటం తప్పనిసరి అనీ, ఎందువల్లనంటే ఎన్నో సంవత్సరాలుగా తనీవిషయంలో అతనిని ఎన్నిసార్లు వేధించుకుతిన్నా, వేడుకున్నా లెక్కచెయ్యక అతను తన కోర్కెలను తీర్చటం లేదనీ అందుకే యిది తమ పథకంలో లిఖితపూర్వకంగా ఉండవలసిన అంశమనీ నొక్కివక్కాణించింది కళ్యాణి

కాని కాంతారావుకి మాత్రం అంత సిల్లీ విషయాన్ని ఆరుసూత్రాల పథకం వంటి బృహత్తర ప్రణాళికలో చేర్చితాను 'కమిట్' కావటం యిష్టంలేకపోయింది అందుకే ఆ సూత్రాన్ని కాస్త సవరించుకోమని కళ్యాణిని బ్రతిమాలేడు.

"నేడు దేశ పరిస్థితులు ఎలా ఉన్నాయో కాస్త ఆలోచించు" అన్నాడు.

"నేటి దేశ పరిస్థితులకీ నా నైలెక్సు చీరకూ సంబంధ మేమిటండీ? పెట్రోలు ధర పెరిగిందని రిక్షా కిరాయి, బియ్యం, కూరల ధరలు పెంచమని అడిగినట్లుంది" అంది తనెంతో తెలివిగా మాట్లాడుతున్నానని మురిసిపోతూ కళ్యాణి.

"అక్కడే పొరబడుతున్నావు కళ్యాణీ! మనం సంఘజీవులం. ప్రధానంగా ప్రపంచపౌరులం. ఇతరులతో నిమిత్తం లేకుండా, ప్రపంచరాజకీయాలతో సంబంధంలేకుండా మనం బ్రతకాలనుకున్నా బ్రతకలేం. వెస్టేషియాలో యుద్ధం జరుగుతున్నందుకు మనదేశంలో పెట్రోలు ధర పెరగటం, ఎక్కడో

అమెరికాలోని డాలరు విలువనుబట్టి మన రూపాయ పల్టీలు కొట్టడం...ఇవన్నీ ఏమిటనుకుంటున్నావు? దేశ పరిస్థితులు బాగాలేదు కాబట్టి నువ్వు జాకెట్టు కుట్టించుకునే టూబైటూ గుడ్డ మీటరు ఇరవై రూపాయలయింది. నువ్వు పెళ్ళిరోజున నూటయేభైకి కొనుక్కున్న పట్టుచీర ఖరీదు ఈరోజు మూడువందలు. నాలాటి మధ్యతరగతి మొగుణ్ణి నెలకోచీర కొనివ్వమని అడగటం నీవంటి చదువుకున్న భార్యకి తగిన విషయమేనా చెప్పు" అంటూ బిక్కమొహంపెట్టాడు.

"అబ్బబ్బ, నేనేదో గంపగయ్యాళి నయినట్లు, మీ ప్రాణాలన్నీ తోడేస్తున్నట్లు— ఎందుకండీ అలా మొహం పెడ్తారు?"అని విసుక్కుని, కాసేపు గుణిసి చివరకునెలకొకటి కాకపోయినా దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, రెండుపుట్టిన రోజులు, వెడ్డింగ్ యానివర్సరీ కాక శ్రావణమాసంలో ఒక చీర-అన్నీ కలిపి ఎనిమిది చీరలు ఏడాదిలో కొనేట్లుగా భర్త అంగీకారాన్ని తీసుకుంది కళ్యాణి.

ఇక మూడవ సూత్రం సినిమాలను గురించి. కాంతారావు నెలకు నాలుగు సినిమాలు చూద్దామంటే కళ్యాణి రెండు చాలు అంటుంది. కళ్యాణి సినిమాలకు అభ్యంతరం తెలపడానికి కారణం పొదుపూ గట్రా అనుకునేరు అది మాత్రంకాదు ఒకప్పుడు కళ్యాణి కాంతారావుకన్న ఎక్కువగానే సినిమాలంటే చెవికోసుకునేది. కాని యీ రోజుల్లో వస్తున్న సినిమాల తీరూతెన్నూ చూసేక కళ్యాణికి సినిమాలనగానే ఒకరకమైన 'ఎలర్జీ' లాంటిది కలగసాగింది. ప్రస్తుతము వస్తున్న తెలుగు సినిమాలను కనుక పరిశీలించినట్లయితే ప్రతి పది సినిమాలలోనూ ఏడు సినిమాలలోని హీరోకి ఇద్దరు హీరోయిన్లుంటున్నారు. ఐనా ఈ మగవాళ్ళకీమధ్య మరీ బుద్ధిలేకుండా పోతోంది. ప్రేయసిగా ఒకస్త్రీకి, భార్యగా ఒక స్త్రీకి హృదయంలో రెండు సీట్లను కేటాయించి అటునుండి యిటూ యిటునుండి అటూ ప్రేమను కుప్పిగంతులు వేయించడం ఫ్యాషనైపోయిందికొన్నాళ్లు. పోనీ ప్రేమించింది ఎవరినైతేనే, పెళ్ళి చేసికొన్నది ఒక్కతినేకదా అని సరిపెట్టుకుంటుంటే యీ మధ్య సినిమా హీరోలకి డెలిబరేట్‌గా రెండు పెళ్ళిళ్ళు చేసేస్తున్నారు సినీ రచయిత (త్రు)లు. ఒక మగవాడు ఇద్దరు స్త్రీలను వివాహమాడటం చట్టబద్ధంకాదనీ, నాగరిక సమాజంలోని ప్రధానాంశమైన వివాహ వ్యవస్థనే కించపరచటమనీ, పైగా అనారోగ్యకరమైన సెంటిమెంట్సును ప్రేక్షకుల మనసులలో నాటటమనీ...యివన్నీ ఆ కథవ్రాసిన వాళ్ళకు, వ్రాయించిన వాళ్ళకు కథను నడిపించిన వాళ్ళకు – వీళ్ళ కందరికీ ఎందుకు తెలియదా అని వాపోతూంటుంది కళ్యాణి. తనుగనుక సెన్సార్ బోర్డు మెంబరయినట్లయితే

మొట్టమొదట ఇద్దరమ్మాయిలు, ఒక బ్బాయి మధ్య ఏర్పడిన ప్రణయ త్రికోణాన్ని పుటుక్కుని కత్తిరించేస్తుందిఅను కునేది కళ్యాణి. ఇలాంటి ఇద్దరమ్మాయిల ప్రేమకథలుగల సినిమాలు చూసేక ఎంత శ్రీరామచంద్రుడికైనా మనసు చలించకపోదని కళ్యాణి భయం. అందుకే భర్తను అలాటి సినిమాలకు ఎంత దూరంగా ఉంచితే అంతమంచిదన్న ఉద్దేశ్యంతో సినిమాలను చూడటం తగ్గించుకుంది కళ్యాణి. భార్య అంతరంగంలోని యీ లోతుపాతులన్నీ తెలియని కాంతారావు ఎంతకూ తన ధోరణిలో సినిమాకు పోదామని పోరుపెట్టాడేతప్ప ఆమె ఎందుకు రానంటుందో అర్థంచేసుకోవటానికి ప్రయత్నించడు.

ఐతే యీ చూడవలసిన సినిమాల సంఖ్యను ఆరుసూత్రాల పథకంలో చేర్చవలసి వచ్చేసరికి కళ్యాణికి తన అభ్యంతరమేమిటో భర్తకి చెప్పక తప్ప లేదు

"అంటే నీ ఉద్దేశ్యం—ఆ సినిమాలు చూసి నేను కూడా రెండో పెళ్లి చేసుకుంటాననా ?" అనడిగాడు కాంతారావు చిరాగ్గా.

"అబ్బ, మరీ పచ్చిగా అలా మాట్లాడకండి. మీ సంగతి నాకు తెలియదటండీ. ఏదో ఆడమనసు..."

"చాల్లే. ఫూలిష్‌గా మాట్లాడకు. నెలకు నాలుగు సినిమాలు చూసే ఫన్ అన్నా జీవితంలో లేకపోతే ' ఎలా ? కాబట్టి నువ్వు ఎలాగైనాసరే యీ విషయంతో పూర్తిగా ఏకీభవించాలి. మరీ నీకంత భయంగా ఉంటే ఒక పనిచెయ్యి మహిళలందరూ కలసి మీరు కనుక ఇద్దమ్మాయిలతో కాలక్షేపం చేసే హీరో కథలను వెండితెరకెక్కించేరంటే వాటిని చూసిన మా భర్తలు ఏకపత్నీవ్రతానికి ఉద్వాసన చెప్పేస్తారేమోనని మాకంద భయంగా ఉంది కనుక మీరిలాటి సినిమాలను తీసి మా భర్తలను పాడు చెయ్యకండి అంటూ సినీ నిర్మాతలందరికీ ఒక విన్నపం పెట్టుకొండి" అన్నాడు కాంతారావు.

అలాగని అంతటితో ఊరుకున్నాపోయేది. "ఐనా సినిమాలు చూడకుండా అడ్డుపెట్టినంత మాత్రాన సరిపోతుందా? చెడిపోయే రోజు రావాలేగాని మగవాడికి ఎన్ని మార్గాలు లేవు ? ఎన్ని అవకాశాలు లేవు?" అన్నాడు కొంటెగా కాంతారావు.

ఇక ఆ మాటలకు అతను కోరుకున్న దానికంటె పదిరెట్లు ఎక్కువగానే కళ్యాణి ఉడుకోవటంతో వాళ్ల సిక్స్ పాయింట్ ఫార్ములాకి హఠాత్తుగా ఆటంకం వచ్చింది.

కళ్యాణి విసురుగా లేచి వెళ్లి పక్క మీద ముసుగుతన్ని పడుకుంది కాంతారావు ఆమె పక్కనే అతికష్టంమీద చోటుచేసుకుని పడుకుని ఆమెను లాలించి మామూలు స్థితికి తీసుకువచ్చేసరికి గంటసేపు పట్టింది

చివరికి సినిమాల విషయంలో

ఇద్దరికీ అంగీకార యోగ్యమైన ఒక సూత్రాన్ని తయారుచేసేరు. అదేమంటే కాంతారావు చెప్పినట్లు నెలకు నాలుగు సినిమాలు చూడవచ్చు. కాని సినిమాలు చూసేముందు ఆ సినిమాలను గూర్చిన సమీక్షలను పత్రికలలో చదివి, అందులో ఇద్దరు భార్యలు, ఒక భర్త థీములేదని తెలుసుకున్న తరువాతనే వెళ్లాలి.

నాల్గవ సూత్రం కళ్యాణి అడపాదడపా దాచే బ్లాక్ మనీని గురించి. ఇంటి ఖర్చులకుగాను కళ్యాణికి భర్తయిచ్చిన డబ్బులో పొదుపుచేసిన మొత్తాన్ని పోపుడబ్బాలలోను పట్టుచీరల మడతలలోను దాచేస్తుంది కళ్యాణి. ఆ సంగతి మొదటిసారిగా గ్రహించిన కాంతారావు "నువ్వేదో అభ్యుదయ భావాలుగల ఆడదాని వనుకున్నాను కానీ మరీ యిలా బ్లాక్ మనీని దాచేంతటి కాపిటలిస్టువనుకో లేదు కళ్యాణీ" అన్నాడు ఆ మాటలు విన్న కళ్యాణి కాసేపు మూతిముడుచుకుని వెంటనే గయ్యిమంటూ లేచింది. "ఎలాగోలా కష్టపడి వెయ్యి రూపాయలు సమకూర్చుదామని నేననుకుంటుంటే మధ్య పానకంలో పుడకలా మీరడ్డు పడతారేమండీ ?" అన్నది

"ఎప్పుడో రాబోయే వెయ్యికోసం యీ నెల సుఖాన్ని పోగొట్టుకోవట మెందుకు ? నువ్వు దాచే పదీ పరకాతో హాయిగా మరో రెండు సినిమాలు చూడవచ్చుగదా అసలే రోజు రోజుకీ రూపాయ విలువ పడిపోతోంది. నువ్వు వెయ్యి రూపాయలు జమచేసే రోజుకి ఆ మొత్తం విలువ నేటి ఐదువందల రూపాయల విలువకు సమానం కావచ్చు అందుకే నా మాట విని నల్ల డబ్బును యిప్పుడే తెలుపు చేసెయ్. హాయిగా ఎంజాయ్ చేద్దాం" అన్నాడు. ఆ మాటలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక కళ్యాణి విసవిస లేచివెళ్లి అక్కడా యిక్కడా తాను దాచిన బ్లాక్ మనీ తాలుకు నూటముప్పై ఏడు రూపాయల చిల్లరా అతని ముందు పోసింది ఆ తరువాత భార్యా భర్త లిద్దరూ నల్ల డబ్బును కూడబెట్టటంవల్ల అనుకున్నంత లాభం కలగకపోగా నష్టం కూడా కలిగే ప్రమాదముందనీ అందుకే ఆ పద్ధతిని పూర్తిగా వదిలిపెట్టేయాలనీ అనుకున్నారు.

ఐదవ సూత్రం తాము కలహ ఘట్టంలో ఉండగా ఎలా ప్రవర్తించాలీ అన్న విషయాన్నిగురించి. మౌన వ్రతమే మహోత్తమం అంటాడు కాంతారావు. ఓగంటో రెండు గంటలో(కలహ తీవ్రతనుబట్టి) ఇద్దరూ మౌనంగా చెరో గదిలోనూ కూర్చున్నట్లయితే కోపం దానంతట అదే తగ్గిపోతుందనీ కోపం తగ్గిన తరవాత ఒకరినొకరు మామూలుగా పలకరించుకోవచ్చుననీ అంటాడు కాంతారావు

"మీరు చెప్పే విషయం వినటానికి బాగానేఉంది ప్రాక్టికల్‌గా చూస్తే అసాధ్యం అనిపిస్తోంది. ముఖ్యంగా

నేనీ సూత్రానికి కట్టుబడి ఉండటం అంత తేలికైన విషయంకాదు ఎందు కంటే మీకు కోపం వచ్చినప్పుడు చక్కగా ఏ పేపరో పుస్తకమో చదువు కుంటూ ఈజీచైర్లో జేరగిలబడి కూర్చుం టారు. నా మటుకు నేను ఎలా కూర్చో గలను ? "అన్నం వడ్డించేను రండి" అనో "ఏం కూరవండమంటారు ?" అనో టీ "తీసుకోండి" అనో ఏదో ఒక విషయాన్ని గురించి మాట్లాడక తప్పదు మీకు సంబంధం లేని పనులు యీ యింట్లో ఏమున్నాయి ? ఉన్న పనులన్ని టినీ చేసేది నేనేకదా అలాటప్పుడు యిష్టం ఉన్నా లేకపోయినా మీతో మాట్లాడక తప్పదు. ఏ కారణంచేత నైనా మౌనవ్రతానికి ఒకసారి భంగం కలిగినా ఆ సూత్రానికే భంగం వాటిల్లి నట్లుకదా" అన్నది కళ్యాణి.

ఆమె చెప్పినదాంట్లో నిజం లేకపో లేదనిపించింది కాంతారావుకి కూడా. అందుకే తన సూత్రాన్ని కొంచెం సవ రించటానికి ఒప్పుకున్నాడు. ఇందాక కళ్యాణి ఉదహరించిన 'అన్నం వడ్డిం చేను' 'ఏం కూర వండా ?' లాటి వన్నీ భార్యా భర్తలందరి మధ్యా 'అఫిషియల్'గా జరిగే సంభాషణలే. వాటిని నిత్యజీవితంలోనుండితొలగించటం కష్టం. 'మౌనవ్రతం' అంటే మనసు విప్పి అరమరికలు లేకుండా 'స్లీగా' మాట్లాడకపోవటం అని కాంతారావు ఉద్దేశ్యం. కాబట్టి కలహఘట్టంలో అధికార సంభాషణకే తప్ప అనధికార సంభా షణలు, చర్చలు జరగటానికి వీల్లేదు అని ఐదవ సూత్రాన్ని తయారుచేయటం జరిగింది.

ఆఖరుదీ ఆరవదీ అయిన సూత్రం ప్రణయకలహం వచ్చినప్పుడు కోప తాపాల ఘట్టాలన్నీ పూర్తయిన తరువాత ముందుగా ఎవరు మాటలు కలపాలి అన్న విషయాన్ని గురించి.

''ఎవరు కలహానికి నాంది పలుకు తారో వాళ్లే మాటలు కలిపి ఆ కలహాన్ని సమాప్తం చెయ్యాలి" అన్నాడు కాంతారావు.

కాంతారావు అలా అనటంలో కొంత లౌక్యం లేకపోలేదు. సాధారణంగా కయ్యానికి కాలు దువ్వేది కళ్యాణే. అందువల్లనే దానిని అంతంచేసే బాధ్య తను కూడా ఆమెకిస్తే బాగుండునని భావించి అలాగన్నాడు

కళ్యాణిమాత్రం తక్కువదా ? "అసలు కలహానికి కారణాన్ని కలిపిం చిందెవరో వాళ్లే ముందు పలకరించాలి'' అన్నది ఆమె దృష్టిలో కలహాన్ని ఎవరు ప్రారంభించినా అది కాంతారావు తెలిసో తెలియకో చేసిన పొరపాటు వల్లనే కలహం ఏర్పడుతుంది అందుకే ఆ మాట అన్నది

దానికి కాంతారావు అంగీకరించలేదు కొంచెంసేపు తర్జన భర్జనలు జరిగి నయ్ చివరికి కలహంలో ఎవరిది పైచెయ్యి అయితే వారే మొదట మాటలు

కలపటానికి ప్రయత్నించాలి అన్న నిర్ణయానికి వద్దామనుకున్నారు. కాని "పైచెయ్యి ఎవరిది?" అన్న విషయాన్ని తేల్చుకోవటం కూడా ఏమంత సులభం కాదని వాళ్లకు తెలిసింది.

"కలహంలో ఎప్పుడూ పైచెయ్యి నీదేగా" అని కాంతారావు అంటే,

"అసలు 'కీ' యిచ్చి కూర్చునేది మీరు. ఆ తరువాత ఊరికే పిచ్చి మొద్దు లాగా వాగుతాను నేను. దాంతో మీరేదో మహర్షులయినట్లు, నేనేమో గయ్యాళి గంపనయినట్లు కనపడుతుంది పైకి. నిజానికి నిశితంగా పరిశీలించినట్లయితే కలహంలో ప్రధానపాత్ర మీదే కాబట్టి మీరే మొదట పలకరించాలి." అన్నది కళ్యాణి ఖచ్చితంగా.

కాంతారావుకి తలూపక తప్పలేదు. ఎంతైనా 'లిటరేచర్' మనిషి కనక తప్పు ఎవరిదైనా ప్రణయకలహం భర్త అనునయాలతోను, లాలింపులతోనూ అవసరమైతే క్షమార్పణలతోనూ ముగిసి నప్పుడే రక్తికడుతుందని గ్రహించిన వాడై తానే మొదట పలకరించటానికి మనస్ఫూర్తిగా అంగీకరించేడు.

అలా భార్యాభర్త లిద్దరూ ఎంతో కష్టపడి ఆరు సూత్రాల పథకాన్ని తయారుచేసి పట్టుమని ఆరు నెల్లన్నా కాకముందే అందులోని ఒక్కొక్క సూత్రం కనీసం అరవైసార్లయినా ఎవరో ఒకరివల్ల ఉల్లంఘింపబడిందని వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను. అలాటి కఠిన సూత్రాలను అమలులో పెట్టటం ఎంత అసాధ్యమో అనుభవజ్ఞులైన దంపతులకు అసలే చెప్పనక్కర్లేదు.

కాని ఎంతైనా కాంతారావు కాస్త 'ప్రిన్సిపుల్సు' ఉన్న మనిషి కనుక తమ ఫార్ములా అలా నామరూపాలు లేకుండా పోవటం చూసి ఉసూరు మన్నాడు.

ఓ రోజు ధైర్యంచేసి భార్యతో "మరీ యిలాగైతే, ఎలా కళ్యాణీ?" అనికూడా అన్నాడు.

దానికి ఫక్కుమని నవ్వింది కళ్యాణి.

"నువ్వు ఎంత ఫూల్‌వి కాంతం! (కళ్యాణికి భర్తమీద ప్రేమ అతిగా పుట్టుకు వచ్చినప్పుడు అలాగే అంటుంది. కాబట్టి భర్తలెవరూ భయపడనవసరం లేదని ప్రార్థన). ఐదు సూత్రాల పథకాలు, ఆరు సూత్రాల పథకాలు-నిజంగా, నిండుగా బ్రతికే మనలాటి భార్యాభర్తలకు ఆ సూత్రాలన్నీ ఎందుకు? యుగ యుగాలుగా దంపతులందరినీ బంధించుతూ వస్తున్నది ఒకే ఒక్క సూత్రం అదే ప్రేమ సూత్రం" అంటూ రెండు చేతులతోను అతని మెడను చుట్టివేసి, అతనిని దగ్గరకు లాక్కుని, అతని తలను తన గుండెకదుముకుంది కళ్యాణి.

అలాటి క్షణాలలో ఏ భర్తమాత్రం నోరుతెరిచి మాట్లాడగలడు?

—